

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.22,31,642
బంగారం	1 గ్రాము 150 మిల్లీ గ్రాములు
వెండి	31 గ్రాముల 220 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



పొంగుతున్న నదులు

అల్పపీడనం ప్రభావంతో కురిసిన వర్షాలకు పలు జిల్లాల్లో నదులు పొంగిపొర్లుతున్నాయి.

- 8లో



బడ్జెటు సమావేశాలకు పటిష్ట భద్రత

శాసనసభలో బడ్జెటు సమావేశాలు పురస్కరించుకుని పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

'తిథి భోజన్' అమలుకు సన్నాహాలు

భువనేశ్వర్: కేంద్ర ప్రభుత్వ పీఎం పోషణ్ పథకం రాష్ట్రంలో అమలు చేసేందుకు యోచిస్తున్నారు. ఈ పథకం కింద పాఠశాలల్లో 'తిథి భోజనం' కార్యక్రమం అంచెలంచెలుగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులను ఈ కార్యక్రమం కింద చేర్చాలని ప్రతిపాదించారు. ప్రత్యేక సందర్భాలు మరియు స్మారక దినం వంటి ప్రత్యేక తిథుల్లో బడిలో పిల్లలకు ప్రత్యేక ఆహారాన్ని సరఫరా చేయడం ఈ పథకం లక్ష్యం. స్థానికులు, సంఘాలు, సంస్థలు ఆయా సందర్భాల్లో ఈ భోజనం అందజేస్తారు. ఈ పథకం కార్యాచరణ పురస్కరించుకుని మార్గదర్శకాలు ఖరారు చేసేందుకు ఈనెల 28న ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించనున్నట్లు అధికారిక వర్గాల సమాచారం. పీఎం పోషణ్ రాష్ట్ర నోడల్ అధికారి అయిన ఉన్నత విద్యా విభాగం డైరెక్టర్ రఘురామ్ అయ్యర్ ఈ విషయమై అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులకు (డీఈవో) లేఖ రాశారు.

కార్యాచరణపై చర్చ

తిథి భోజనం కోసం ప్రతిపాదిత మార్గదర్శకాల కార్యాచరణపై సమావేశం నిర్వహించనున్నట్లు ఈ లేఖలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కింద పాఠశాల విద్యార్థులకు పౌర సంఘం సభ్యులు ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని అందజేస్తారు. స్థానిక వ్యక్తి లేదా సంస్థ కనీసం 100 రోజులకు ఒక్కసారి ఆహారం అందించవచ్చని ఆయన తెలిపారు. ప్రజలు ప్రత్యేక సందర్భాల్లో లేదా ఏదైనా స్మారక రోజున ఆహారాన్ని అందించవచ్చు. ప్రీ ప్రైమరీ తరగతుల విద్యార్థులను కవర్ చేయడానికి పాఠశాలల కోసం కేంద్రం ప్రధాన మంత్రి పోషణ్ పథకాన్ని ప్రారంభించింది.

నేడు గవర్నర్ ప్రసంగం

భువనేశ్వర్: శాసనసభలో బడ్జెటు సమావేశాలు రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్ ప్రసంగంతో ప్రారంభం కానున్నాయి. ఆయన ప్రసంగంపై కృతజ్ఞత తీర్మానం ప్రతిపాదించడంతో వర్షాకాల సమావేశాల తొలిరోజు ముగుస్తుంది. తదుపరి సమావేశాలు రెండు విడతల్లో సెప్టెంబర్ 13వ తేదీ వరకు కొనసాగుతాయి. ఆగస్టు 1 నుంచి 19 వరకు సభలో సమావేశాలకు తాత్కాలికంగా తెర పడుతుంది. ఆగస్టు 20 నుంచి మలి విడత సమావేశాలు ప్రారంభం అవుతాయి.

బడ్జెటు సమావేశాల షెడ్యూల్

తేదీ	ప్రధాన కార్యక్రమం
జూలై 23	డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రకటన
	గవర్నర్ ప్రసంగంపై కృతజ్ఞత తీర్మానం, చర్చ
జూలై 24	డిప్యూటీ స్పీకర్ ఎన్నిక
	గవర్నర్ ప్రసంగంపై కృతజ్ఞత తీర్మానం, చర్చ
జూలై 25	2024-25 ఆర్థిక సంవత్సరపు బడ్జెటు సమర్పణ
జూలై 26	అధికారిక లావాదేవీలు
జూలై 27, 28	సెలవు (శని, ఆది వారాలు)
జూలై 29	బడ్జెటుపై చర్చ
జూలై 30	బడ్జెటుపై చర్చ
	ఓట్ ఆన్ అకౌంటు తీర్మానం
	ఓట్ ఆన్ అకౌంటుపై చర్చ
జూలై 31	ఓట్ ఆన్ అకౌంటు వ్యయ మంజూరు
ఆగస్టు 1 నుంచి 19 వరకు	సమావేశాలు ఉండవు
ఆగస్టు 20	విభాగాలవారీగా సలహా మండలి నివేదికల సమర్పణ
ఆగస్టు 21, 22, 23	బడ్జెటు డిమాండ్ల మంజూరు
ఆగస్టు 24, 25	సెలవు (శని, ఆది వారాలు)
ఆగస్టు 26	సెలవు (జన్మాష్టమి)
ఆగస్టు 27 నుంచి 31	బడ్జెటు డిమాండ్ల మంజూరుపై చర్చ
సెప్టెంబర్ 1	సమావేశాలు ఉండవు
సెప్టెంబర్ 2 నుంచి 6 మరియు 9	బడ్జెటు డిమాండ్ల మంజూరు
సెప్టెంబర్ 7, 8	సెలవు (శని, ఆది వారాలు)
సెప్టెంబర్ 10	2024-25 బడ్జెటు వ్యయ మంజూరు బిల్లు
సెప్టెంబర్ 11	అధికారిక లావాదేవీలు
సెప్టెంబర్ 12, 13	ప్రైవేటు సభ్యుల లావాదేవీలు

- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- సెప్టెంబర్ 13 వరకు కొనసాగనున్న అసెంబ్లీ
- పలు హామీలపై చర్చించే అవకాశం



నవీన్ పట్నాయక్ అధ్యక్షతన బీజేడీ సమావేశం

సభా సమయం



అఖిలపక్ష సమావేశానికి విపక్ష నేత నవీన్‌కు ఆహ్వానం పలుకుతున్న సీఎం మోహన చరణ్ మాఝి, డిప్యూటీ సీఎం కనకవర్ధన్ సింగ్‌దేవ్



స్పీకర్ సురమా పాఢి అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం

భువనేశ్వర్: రాష్ట్ర 17వ శాసనసభ తొలి సమావేశాలు సోమవారం నుంచి ఆరంభం కానున్నాయి. సభలో సభ్యులందరికీ ఈ సమావేశాలు తొలి అనుభవంగా పేర్కొనవచ్చు. అధికార, విపక్షాలు తొలిసారిగా వారి హోదాల్లో పగ్గాలు చేపట్టి సభలోకి వెళ్తున్నాయి. బీజేపీకి ప్రభుత్వ పాలన కొత్తకాగా, బీజేడీకి విపక్ష వ్యవహారం సరికొత్త. ఈ సమావేశాలు సెప్టెంబర్ 13 (శుక్రవారం) వరకు కొనసాగనున్నాయి. ఈ వ్యవధిలో 27 పని దినాలు ఉంటాయి. రెండు విడతల్లో సమావేశాలు నిర్వహించనున్నారు. సభలో సరికొత్త వాతావరణం అలముకునే అవకాశం ఉంది. తొలి అనుభవంతో అధికార పక్షం, సుదీర్ఘ పాలన దక్షతతో విపక్షం ఈ సమావేశాల్లో ప్రధాన పాత్రధారులు. ఈ రెండు వర్గాల మధ్య ఈసారి బడ్జెటు సమావేశాలు రసవత్తరంగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. విపక్షంతో మైత్రి భావంతో నిర్మాణాత్మక ధోరణితో సమావేశాలను విజయవంతం చేయాలనే దృక్పథంతో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆచితూచి అడుగు వేస్తున్నారు. తోటి మంత్రుల తప్పిదాలను సమయోచితంగా సవరిస్తూ విపక్ష నేత మనసు దోచుకునే లక్ష్యంతో సరికొత్త పోకడ ప్రదర్శిస్తున్నారు.

ప్రత్యక్ష ఆహ్వానం

శాసనసభ సమావేశాలు పురస్కరించుకుని ఆదివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరు కావాలని విపక్ష బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, శాసనసభ విపక్ష నేత నవీన్ పట్నాయక్‌కు ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి స్వయంగా నవీన్ నివాస్ సందర్శించారు. ఆయనతో ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ ఉన్నారు. అఖిల పక్ష సమావేశానికి ఆహ్వానించడంతో పాటు సభలో నిర్మాణాత్మకమైన చర్చలుతో ఉత్తమ పాలనకు అండగా నిలవాలని అభ్యర్థించారు.

మహనీయులను అగౌరవపరచం

రాష్ట్రంలో మహనీయులను ఎట్టిపరిస్థితుల్లోనూ అగౌరవపరచమని ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా రుజువు చేసుకున్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిజూ పట్నాయక్ క్రీడా పురస్కారం పేరుని ఒడిశా రాష్ట్ర క్రీడా పురస్కారంగా మార్చినట్లు శుక్రవారం దుమారం రేగింది. సంబంధిత శాఖ ఈ మేరకు మార్గదర్శకాలను అధికారికంగా విడుదల చేసింది. అయితే ఈ విషయం తనకు తెలియదని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున బిజూ పట్నాయక్ క్రీడా పురస్కారం పేరు తొలగించడం, మార్చడం వంటిది జరిగేది లేదని స్పష్టం చేశారు. బిజూ పట్నాయక్ నిలువెత్తు రాజకీయ చతురత దేశ, రాష్ట్ర రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిందన్నారు. అటువంటి మహనీయునిపై అగౌరవం ప్రదర్శించేది ఉండబోదని తెలిపారు. నవీన్ నివాస్ సందర్శనకు ముందు రాష్ట్ర సచివాలయంలో ఈ విషయాన్ని మీడియా సమక్షంలో బహిరంగ పరిచారు.

అఖిల పక్ష సమావేశం

శాసనసభ స్పీకర్ సురమా పాఢి అధ్యక్షతన ఆదివారం అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్, విపక్ష బిజూ జనతా దళ్ ప్రతినిధి చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్ హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం శాసనసభ వ్యవహారాల మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, సీపీఎం సభ్యులు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత ఎంపిక కాకపోవడంతో పీసీసీ అధ్యక్షుడితో అఖిల పక్ష సమావేశం కోసం సంప్రదించారు. సీపీఎం సభ్యుడు లక్ష్మణ్ ముండాతో ఫోన్‌లో మాట్లాడి హాజరు కావాలని అభ్యర్థించినట్లు ఆయన తెలిపారు.

బీజేడీ సమావేశం

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బీజేడీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నాయకుడు నవీన్ పట్నాయక్ అధ్యక్షతన బీజేడీ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. జూలై 22న ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు ముందు జరిగిన సమావేశానికి పార్టీకి చెందిన 51 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా నవీన్ పట్నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 4.5 కోట్ల మంది ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేయాలని పార్టీ ఎమ్మెల్యేలకు సూచించారు. పార్టీకి ప్రజలు కొత్త బాధ్యతను అప్పగించారని పేర్కొంటూ, సమర్థవంతమైన ప్రతిపక్షంగా బీజేడీ తన బాధ్యతను నిర్వర్తించాలని సమావేశంలో తీర్మానించింది. పార్టీ అధిష్టానం తమకు కేటాయించిన శాఖల పనితీరుపై నిఘా ఉంచాలని శాసన సభ్యులను కోరారు. బీజేడీ చీఫ్ విప్ ప్రమీలా మల్లిక్, డిప్యూటీ చీఫ్ విప్ ప్రతాప్ కేశరీ దేబ్ సమావేశానంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తాల్సిన వివిధ అంశాలపై చర్చించినట్లు చెప్పారు. బీజేడీ ఎమ్మెల్యేలు బీజేపీ ప్రభుత్వ పనితీరును నిశితంగా పరిశీలించాలని, ఎన్నికల మ్యానిఫెస్టోలో కాషాయ పార్టీ ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేస్తున్నారో లేదో చూడాలని కోరారు. సభను పూర్తి విశ్వాసంతో ఎదుర్కోవాలని ఎమ్మెల్యేలను కోరారు. రాష్ట్రంలో ధరల పెరుగుదల, రథయాత్ర నిర్వహణ, శాంతి భద్రతల పరిస్థితి, బాలాసోర్‌లో కర్ఫ్యూ, 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం ఉంది. అంతకుముందు పద్మశ్రీ కమలా పూజారి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

ఇక సెలవు..!



గౌరవ వందనం సమర్పిస్తున్న పోలీసులు

- ప్రభుత్వ లాంఛనాలతో కమలా పూజారి అంత్యక్రియలు
- కన్నీరుమున్నీరైన పాత్రోపుట్ గ్రామస్తులు



శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, అధికారులు



జయపురం ఆస్పత్రిలో నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు

జయపురం: పద్మశ్రీ కమలా పూజారి అంత్యక్రియలను ఆమె స్వగ్రామం పాత్రోపుట్‌లో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి 1.10 గంటలకు జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి కటక్ ఎస్‌సీబీ ఆస్పత్రి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో ఆమె పార్థివదేహాన్ని తీసుకొచ్చారు. ఆమె మృతదేహం చేరే సమయానికి అధికారులంతా అక్కడే వేచి ఉన్నారు. ఈ సందర్భంగా ఆమెకు నివాళులర్పించారు. అనంతరం రాత్రి ఆస్పత్రిలోనే మృతదేహాన్ని ఉంచి, ఆదివారం ఉదయం 7.30 గంటలకు పాత్రోపుట్ గ్రామానికి తీసుకెళ్లారు. ఆ గ్రామ శ్మశానవాటికలో సాంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు. పోలీసులు తుపాకులు పేల్చి, ఆమె మృతదేహంపై జాతీయ పతాకాన్ని ఉంచారు. కమలా పూజారి అంతిమ యాత్రలో భారీగా అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. ఆమె కుటుంబ సభ్యులు, పాత్రోపుట్ గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

కమలా పూజారి మరణం తీరని లోటు

పద్మశ్రీ కమలా పూజారి మరణం వ్యవసాయ రంగానికి తీరని లోటని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. ఆమె స్వగ్రామం పాత్రోపుట్ వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను ఆదివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. కమలా పూజారి కొరాపుట్ జిల్లాకే కాకుండా దేశానికే గర్వకారణమని పేర్కొన్నారు. మరుగున పడుతున్న సాంప్రదాయ వరి వంగడాల సేకరణ, వాటి భద్రతకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షురాలు డా.ఇందిర నందో మాట్లాడుతూ.. ఆమె మరణం ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక సమయాల్లో వ్యవసాయానికి సంబంధించిన విషయాలను ఆమెతో చర్చించానని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమెతో పాటు బీజేడీ నేత బాలారాయ్ ఉన్నారు. అదేవిధంగా జయపురం బీడీవో శక్తి మహాపాత్రో, శాస్త్రవేత్త ప్రశాంత పరిడ, సర్పంచ్ కమల లోచన పూజారి, సామాజిక కార్యకర్త నారాయణ మహంతి తదితరులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.



కమలా పూజారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

సీఎల్పీ నాయకుడిగా పొట్టంగి ఎమ్మెల్యే రాం ఖడం



రాం చంద్ర ఖడం

కొరాపుట్: రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా పొట్టంగి ఎమ్మెల్యే రాం చంద్ర ఖడం నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆ పార్టీ ఏఐసీసీ సాధారణ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. సీఎల్పీ నాయకుడిగా రాం చంద్ర ఖడం, ఉప నాయకునిగా అశోక్ దాస్, చీఫ్ విప్‌గా సీఎస్ రజన్ ఎక్కాలను నియమించారు. రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి 14 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ పదవి కోసం జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి పోటీలో ఉన్నట్లు ప్రచారం జరిగింది. అయితే బాహిణీపతికి వ్యతిరేకంగా కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క వర్గం రాం ఖడంకి మద్దతు తెలిపినట్లు సమాచారం.

అఖిలపక్ష సమావేశం నేపథ్యంలో...

అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా స్పీకర్ సురమా పాఢీ అఖిలపక్ష సమావేశానికి అన్ని పార్టీలను ఆహ్వానించారు. అయితే కాంగ్రెస్ పార్టీ నుంచి సీఎల్పీ నాయకుని ఎన్నిక జరగనందున ఎవరినీ ఆహ్వానించలేదు. దీంతో కాంగ్రెస్ హాజరు లేకుండానే అఖిల పక్ష సమావేశం జరిగింది. ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ పరిణామంపై జయపూర్ ఎమ్మెల్యే బాహిణీపతి మీడియాతో మాట్లాడుతూ సీఎల్పీ నాయకుడిని ఎంపిక చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో వెనువెంటనే రాం ఖడంను ఎంపిక చేస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. అయితే బాహిణీపతి బహిరంగంగా అసహనం వ్యక్తం చేయడాన్ని అతని వ్యతిరేకవర్గం అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడం వలన వెంటనే రాం ఖడను తక్షణమే ప్రకటించినట్లు తెలుస్తోంది.

పలు రైళ్లు మళ్లింపు

కొరాపుట్: కొత్తవలస-కిరండోల్ రైల్వేమార్గంలో భారీ వర్షాలు నేపథ్యంలో పలు రైళ్లు మళ్లించారు. 18514 నంబర్ గల విశాఖపట్నం-కిరండోల్ ఎక్స్‌ప్రెస్, 18513 నంబర్ కిరండోల్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లు అరుకు మీదుగా వెళ్లేవి. వీటిని ముందస్తు జాగ్రత్తగా రాయగడ, విజయనగరంల మీదుగా ఈనెల 24 వరకు కొనసాగిస్తారు. రైళ్లు కిరండోల్ వరకు వెళ్లకుండా దంతేవాడ నుంచి రాకపోకలు సాగిస్తాయి. అదేవిధంగా 08551 నంబర్ గల విశాఖపట్నం-కిరండోల్ ప్యాసింజర్, 08552 నంబర్ గల కిరండోల్-విశాఖపట్నం ప్యాసింజర్ రైళ్లు దంతేవాడ వరకు రాకపోకలు సాగించనున్నాయి. ఈ మార్పులు ఆదివారం నుంచి అమల్లోకి వచ్చాయి.

వలస కార్మికుడికి అండగా..!



గంగారాం

రాయగడ: పనిచేస్తున్న కంపెనీలో సరిగా జీతం ఇవ్వకపోవడంతో ఎవ్వరికీ చెప్పకుండా ఇంటికి చేరుకోవాలనే తాపత్రయంతో కాలి నడకతో వెళ్తున్న కార్మికుడికి సామాజిక కార్యకర్త సరోజ్ మండల్ అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. జునుపాణి గ్రామానికి చెందిన గంగారాం ఆరు నెలల క్రితం ఉపాధి కోసం పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంకు కొంతమంది స్నేహితులతో కలిసి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక కంపెనీలో కూలి పనికి కుదిరి తోటి స్నేహితులతో ఉండేవాడు. అయితే పనిచేసి ఇంటికి కొంత డబ్బు పంపించాలని కలలుగన్న ఆయనకు అక్కడ కష్టాలు మొదలయ్యాయి. నెలలు గడుస్తున్నా యాజమాన్యం అతనికి నెలవారీ జీతం ఇవ్వకపోవడతో, పనిచేసినా ఫలితం లేదని గమనించి ఎవ్వరికీ చెప్పకుండా ఇంటికి వెళ్లేందుకు సన్నాహాలు చేసుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ట్రైన్‌లో రాయగడకు చేరుకున్నాడు. అయితే అక్కడ నుంచి చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో ఇంటికి వెళ్లేందుకు ఏం చేయాలో తెలియని దీన వాస్థలో నడక మార్గాన రాయగడ నుంచి కాసీపూర్ చేరుకున్నాడు. ఒక టీ స్టాల్ దగ్గర అతనిని చూసిన సామాజిక కార్యకర్త సరోజ్ మండల్ దగ్గరకు వెళ్లి వివరాలు అడిగాడు. తనది నవరంగపూర్ జిల్లా అని పపడహండి పంచాయతీ జునుపాణి గ్రామంగా గంగారాం వివరాలు తెలియజేశాడు. చేతిలో డబ్బులు లేకపోవడంతో గత్యంతరం లేక కాలినడకన ఇక్కడికి చేరుకున్నానని చెప్పాడు. దీంతో మండల్ పూర్తి వివరాలను సేకరించి ఆ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు ఇంటికి వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మానవతాదృక్పథంతో ఆయన చేసిన సేవకు పలువురు ప్రశంసిస్తున్నారు.

బైకుల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు



అరెస్టైన నిందితుడు కునాల్ మిషాల్



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

రాయగడ: రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ఉన్న బైకులను అత్యంత చాకచక్యంతో దొంగలిస్తున్న ముగ్గురు నిందితులను జిల్లాలోని గుణుపూర్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో గుణుపూర్ అంబేడ్కర్ కాలనీకి చెందిన కునాల్ మిషాల్‌తో పాటు మరో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు పోలీసులు తెలియజేశారు. ఈ మేరకు గుణుపూర్ ఆదర్శ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. తరచూ గుణుపూర్ ప్రాంతంలో బైకుల చోరీలు జరుగుతున్న కేసులు నమోదు కావడంతో ప్రత్యేక దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ క్రమంలో కునాల్ మిషాల్‌ని పట్టుకుని విచారించగా, అతనికి ఈ దొంగతనాల్లో మరో ఇద్దరు మైనర్లు సహకరిస్తున్నట్లు తెలిసిందన్నారు. వీరి నుంచి నాలుగు బైకులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. నిందితులు ఈనెల 3వ తేదీన విశాఖపట్నంలోని ఆర్‌కే బీచ్ సమీపంలో పార్కింగ్ స్థలంలో ఉన్న ఒక బైక్, పర్లాకిమిడి బస్టాండులో మరో బైక్, గుణుపూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో, గుణుపూర్‌లోని లక్ష్మణ్ ఢెపా వీధిలో మరో రెండు బైకులను దొంగిలించినట్లు తెలిపారు.

సీఎంకు పరిపాలనపై నియంత్రణ లేదు

- బీజేడీ అధికార ప్రతినిధి లేఖశ్రీ సామంత సింగార్



మాట్లాడుతున్న లేఖశ్రీ సామంత సింగార్

భువనేశ్వర్: రాష్ట్ర పాలనలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝికి నియంత్రణ లేదని విపక్ష బిజూ జనతా దళ్ ఘాటుగా స్పందించింది. బిజూ పట్నాయక్ స్పోర్ట్స్ అవార్డు పేరు మార్చడానికి సంబంధించిన వివాదంపై ప్రతిపక్ష బిజూ జనతా దళ్ (బీజేడీ) ఆదివారం అధికార పక్షం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)పై విరుచుకుపడింది. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేడీ అధికార ప్రతినిధి లేఖశ్రీ సామంత సింగార్ మాట్లాడారు. బిజూ పట్నాయక్‌ను పార్టీలకు అతీతంగా నాయకులు గౌరవిస్తారని, అతని ప్రాముఖ్యతను అణగదొక్కే ఏ ప్రయత్నాన్నైనా ఖండించాల్సిందేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవార్డుల పేర్లను మార్చే ఎత్తుగడలపై రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన ఆమె, రాష్ట్ర చరిత్రను మార్చేందుకు కాషాయ పార్టీ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. బిజూ పట్నాయక్‌ను ఒడియా ఆత్మగౌరవం, గర్వానికి చిహ్నంగా పరిగణిస్తారన్నారు. బీజేపీ ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడకుండా ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు.

తెలియదని సీఎం చెప్పడం హాస్యాస్పదం

క్రీడా శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ గురించి తనకు తెలియదని ముఖ్యమంత్రికి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాగా బిజూ పట్నాయక్ స్పోర్ట్స్ అవార్డు పేరు మార్చడంపై తమ ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆదివారం స్పష్టం చేసిన తర్వాత బీజేడీ అధికార ప్రతినిధి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. బిజూ పట్నాయక్ స్పోర్ట్స్ అవార్డు గతంలో మాదిరిగానే కొనసాగుతుందని, పేరు మార్పుపై అధికారికంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సీఎం స్పష్టం చేశారు. కాగా లోగడ 2001-2002లో బీజేడీ ప్రభుత్వం బిజూ పట్నాయక్ గౌరవార్థం రాష్ట్రంలోని ప్రముఖ క్రీడా ప్రముఖులు మరియు క్రీడా జర్నలిజంలో అత్యుత్తమ ప్రతిభావంతులకు ఈ అవార్డును ఏర్పాటు చేసింది. ఇది రాష్ట్ర క్రీడా రంగంలో అత్యున్నత గౌరవంగా పేరొందింది. క్రీడలు మరియు యువజన సేవల విభాగం జూలై 19 (శుక్రవారం)న విడుదల చేసిన నోటిఫికేషన్‌లో క్రీడలు, శౌర్యం మరియు రాష్ట్ర అవార్డుల కోసం ఇప్పటికే ఉన్న బిజూ పట్నాయక్ అవార్డుల స్థానంలో ఒడిశా రాజ్య క్రీడా సమ్మాన్‌ను ఏటా ఎనిమిది విభాగాల్లో ప్రదానం చేయడానికి ఎంపిక చేసింది. ఈ నిర్ణయంతో బీజేపీ సంకుచిత, ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని బీజేడీ ఆరోపించడంతో రాజకీయ శిబిరాల్లో తీవ్ర కలకలం రేపింది.

క్లుప్తంగా

కేన్సర్ రోగికి రూ.83 వేలు ఆర్థిక సాయం



కేన్సర్ రోగికి ఆర్థిక సాయం అందిస్తున్న సంఘు సభ్యులు

నరసన్నపేట: స్థానిక మారుతీ నగర్‌లో నివాసముంటున్న హనుమంతు సింహాచలంకు పట్టణ కాళింగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ. 83 వేలు ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబానికి చెందిన సింహాచలం బ్లడ్ కేన్సర్‌తో బాధ పడుతున్నారు. విషయం తమకు తెలియడంతో వైద్య, కుటుంబ ఖర్చుల నిమిత్తం ఈ మొత్తం అందించినట్లు సంఘం అధ్యక్షుడు ఉప్పాడ పూర్ణారావు తెలిపారు. ఈ మొత్తాన్ని సంఘ సభ్యుల నుంచి సేకరించినట్లు తెలిపారు. ఆదివారం ఈ మొత్తాన్ని సింహాచలంకు అందించామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రోణంకి కృష్ణంనాయుడు, మార్పు విజయకుమార్, సింగూరు శ్రీనివాసరావు, బమ్మిడి శ్రీరామమూర్తి, సువ్వార మురళీధర్, దానేటి గిరిదరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాల వేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

నరసన్నపేట: విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని, గౌరవం లభిస్తుందని పౌరవిమానయాన మంత్రి, శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా సరస్వతీ దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల పదవీ విరమణ పొందిన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ స్వామి దంపతులను సత్కరించారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే తమ ధ్యేయమని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత చదువులు చదువుకునేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మేందర్ రెడ్డి

శ్రీకాకుళం, శ్రీకాకుళం న్యూ కాలనీ: కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని రంగా రెసిడెన్సీలో డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు మాట్లాడుతూ గత ఏడాది కేజీబీవీల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసిన ఉపాధ్యాయులను ఈ విద్యా సంవత్సరంలో కూడా కొనసాగించాలన్నారు. కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బందికి మూడు నెలల బాండ్‌ల విధానం రద్దు చేయాలన్నారు. గత ఏడాది కాంట్రాక్టు పీజీటీ కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లో జరిగిన అవకతవకలు సరిచేయాలన్నారు. బోధనేతర సిబ్బందిని ఆప్కాస్ పొరుగు సేవల సంస్థ నుంచి తప్పించి 2018 మునుపటి మాదిరిగా కాంట్రాక్టు పద్ధతిలో నియమకాలు చేపట్టాలని కోరారు. జిల్లా కార్యవర్గ సమావేశం పూజారి హరిప్రసన్న అధ్యక్షతనలో నిర్వహించారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కోత ధర్మారావు, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము అప్పలరాజు, మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రఘుస్వామి, జి.భాస్కరరావులు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

కొరాపుట్: కొత్తవలస–కిరండోల్ రైల్వేమార్గంలో భారీ వర్షాలు నేపథ్యంలో పలు రైళ్లు దారి మళ్లించారు. 18514 నంబర్ గల విశాఖపట్నం–కిరండోల్ ఎక్స్‌ప్రెస్, 18513 నంబర్ కిరండోల్–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లు అరుకు మీదుగా వెళ్లేవి. వీటిని ముందస్తు జాగ్రత్తగా రాయగడ, విజయనగరంల మీదుగా ఈనెల 24 వరకు కొనసాగిస్తారు. రైళ్లు కిరండోల్ వరకు వెళ్లకుండా దంతేవాడ నుంచి రాకపోకలు సాగిస్తాయి. అదేవిధంగా 08551 నంబర్ గల విశాఖపట్నం–కిరండోల్ ప్యాసింజర్, 08552 నంబర్ గల కిరండోల్–విశాఖపట్నం ప్యాసింజర్ రైళ్లు దంతేవాడ వరకు రాకపోకలు సాగించనున్నాయి. ఈ మార్పులు ఆదివారం నుంచి అమల్లోకి వచ్చాయి. ప్రయాణికులు ఈ మార్పులు గమనించాలని రైల్వే అధికారులు సూచించారు.

పొంగుతున్న నదులు

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



కొరాపుట్: నబరంగ్‌పూర్ కూలిన భజరంగ్ రైస్ మిల్



మల్కన్‌గిరి: జోడాంభో ఆరోగ్య కేంద్రంలోకి వరద నీరు ప్రవేశిస్తున్న దృశ్యం



నీట మునిగిన ఎంవీ 55 గ్రామం



మల్కన్‌గిరి: కలేరు వద్ద విరిగిన వంతెన

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు పంచాయతీ కలేరు గ్రామం వద్ద వంతెన విరిగి మల్కన్‌గిరి నుంచి మోటు మీదుగా వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఫలితంగా మల్కన్‌గిరి–కలిమెల, కలిమెల –పోడియాకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే మల్కన్‌గిరి–జయపురం రహదారిలో పంగం వద్ద వంతెనపై నీరు ప్రవహిస్తోంది. కలిమెల సమితి కంగుర్‌కొండ వంతెనపై ఆదివారం మధ్యాహ్నానికి 5 అడుగుల మేర నీటి ప్రవాహం ఉంది. పొట్టేరు వద్ద నీరు తగ్గినా వంతెన మధ్యలో భారీచెట్టు ఇరుక్కుపోయింది.

- ఆరోగ్య కేంద్రంలోకి నీరు

మల్కన్‌గిరి జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా జోడాంభో ఆరోగ్య కేంద్రంలోకి ఆదివారం వరద నీరు చేరింది. దీంతో మందులు నీట మునిగాయి. నీరు అదుపుచేసే మార్గం లేకపోవడంతో రోగులకు ఇళ్లకు పంపిచారు. అదేవిధంగా ఎంవీ 55 గ్రామాన్ని వరద నీరు ముంచెత్తింది.

- సురక్షిత ప్రాంతాలకు 120 కుటుంబాలు

మల్కన్‌గిరి జిల్లాలో వరద ప్రభావం ఎక్కువగా ఉన్నటువంటి ఎంవీ 96, ఎంవీ 90, పోట్టేరు, కంగుర్‌కొండ, ఎంవీ 55, అల్మ తదితర ప్రాంతాల నుంచి 120 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు కలెక్టర్ సచిన్ పవార్ తెలియజేశారు. బాధితులకు వసతి, భోజన సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. నష్టపోయిన వారికి పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు.

- మాచ్‌ఖండ్‌లో 2 గేట్లు ఎత్తివేత


కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా ఉమ్మడి రాష్ట్రాల సంయుక్త నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ రిజర్వాయర్‌లో రెండు గేట్లు ఎత్తి వేశారు. ఆదివారం వేకువజామున కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితిలో మాచ్‌ఖండ్ డ్యామ్‌లో 6, 7 గేట్లు ఎత్తి వేశారు. డ్యామ్‌లోకి ప్రతి సెకన్‌కి 1000 క్యూసెక్‌ల నీరు వచ్చి చేరుతోంది. అలాగే గేట్లు ఎత్తి వేయడంతో ప్రతీ సెకెన్‌కి 2000 క్యుసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఈ డ్యామ్‌లో నీటిమట్టం ప్రమాద ఘంటికలు మోగిస్తూ 89.7 అడుగులకు చేరుకోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. విడుదల అవుతున్న నీరు చిత్రకొండ జలాశయం వైపు మరలుతోంది.

- కుప్పకూలిన రైస్ మిల్

భారీ వర్షాలకు నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ బస్టాండ్ వెనుకనున్న బజరంగ్ రైల్ మిల్ కూలిపోయింది. అప్పటివరకు మిల్‌లో ఉన్న కార్మికులు భోజనానికి వెళ్లడంతో పెను ప్రమాదం తప్పింది. మిల్‌తో పాటు ఆనుకొని ఉన్న యజమాని నివాస భవనం, కార్యాలయం కూడా మట్టిలో కలిసిపోయాయి. మిల్‌లో ఉన్న 30 వేల క్వింటళ్ల ధాన్యం నేలపాలయ్యింది. వాటి విలువ సుమారు రు.30 లక్షలు ఉంటుందని యజమాని వికాష్ అగర్వాల్ పేర్కొన్నారు. ఈ సమాచారం పౌర సరఫరాల శాఖ కార్యాలయంకి అందించారు. తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.



మల్కన్‌గిరి: పొట్టేరు గ్రామం వద్ద విరిగిన వంతెన పరిశీలిస్తున్న దృశ్యం



కొరాపుట్: గేట్లు ఎత్తు వేసిన దృశ్యం



మల్కన్‌గిరి: పొట్టేరు వంతెనపై ప్రవహిస్తున్న నీరు



మల్కన్‌గిరి: కంగుర్‌కొండ గ్రామం వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

చెరువులో మునిగి వ్యక్తి మృతి



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి కదబాల్ గ్రామ చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం సాయంత్రం కదబాల్ గ్రామానికి చెందిన సహదేవ్ జాని (36) తన బాతులు చెరువులో ఉండిపోవడంతో తీసుకురావడం కోసం చెరువు వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో చెరువులో కాలు జారడంతో మునిగిపోయడు. అయితే బాతులు కోసం వెళ్లిన వ్యక్తి రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో వర్షం వలన ఎక్కడో ఉంటాడని కుటుంబ సభ్యులు అనుకున్నారు. అనంతరం ఆదివారం ఉదయం నాటికి బాతులు చెరువులోనే ఉండడంతో అనుమానం వచ్చి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చెరువులో గాలించగా సహదేవ్ మృతదేహం లభ్యమైంది. వెంటనే సమాచారం అందుకున్న మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి



రాయగడ: బాబాకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



రాయగడ: బాబా మందిరం ప్రాంగణంలో హోమం నిర్వహణ



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో సాయి దర్శనం చేసుకుంటున్న కలెక్టర్ కమలోచన్ మిశ్ర

గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం ఊరూరా ఆధ్యాత్మిక శోభ నెలకుంది. తెల్లవారుజాము నుంచే సాయిబాబాతోపాటు పలు ఆలయాలకు భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సాయినాథునికి క్షీరాభిషేకం, విష్ణు సహస్ర పారాయణం, పల్లకీ సేవ చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



జయపురం: ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుదక్షిణ ఉత్సవం

మంటల్లో కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

కొరాపుట్: జిల్లాలోని దుమ్రిపుట్ సమీపంలో మిషింగ్ గుడ వద్ద 26వ నంబర్ జాతీయ రహదారిపై కారు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. సునాబెడా నుంచి ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు ఒక కారులో కొరాపుట్ వైపు వస్తున్నారు. ఆ సమయంలో కారు వెనుక నుంచి పొగలు రావడంతో వెనుక ఉన్న వాహనదారులు గుర్తించి, కారులో ఉన్నవారిని అప్రమత్తం చేశారు. దీంతో వెంటనే కారులో ఉన్నవారు దిగిపోయారు. వెనువెంటనే కారుకి మంటలు పెరిగి దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు అదుపు చేశారు.

తేనెటీగల దాడిలో 12 మందికి గాయాలు

రాయగడ: తేనెటీగల దాడిలో 12 మంది గాయాలు పాలయ్యారు. జిల్లాలోని కాసీపూర్ సమితి బంకంబ పంచాయతీలోని తాలాతాడింగి గ్రామంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొందరు సమీపంలోని నీలగిరి చెట్లను నరుకుతున్న సమయంలో ఒక చెట్టుకి ఉన్న తేనెటీగలు దాడి చేశాయి. దీంతో లలిత జొడియా, మిలికి ముదులి, సాయిమే మాఝి, ఒలా మాఝి, అఖ్యబతి ముదులి, అర్పిత మాఝి, నవమీ ముదులి, సదాయి జాని, పాతపాయి జాని, గురుముని జొడియా, కురుణ నాయక్ తదితరులు గాయాలపాలయ్యారు. వీరిని సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు.

బీజేపీ శాసనపక్ష సమావేశం

రాష్ట్ర శాసనసభ వర్షాకాలం సమావేశాలు పురస్కరించుకుని అధికార పక్షం భారతీయ జనతా పార్టీ శాసనసభ సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. రాష్ట్ర శాసనసభ 54వ నంబర్ గదిలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్, ఎమ్మెల్యేలు, మంత్రులు హాజరయ్యారు.

– భువనేశ్వర్



జగన్నాథుని సన్నిధిలో సీఎం మోహన్ చరణ్



శ్రీమందిరం ఆవరణలో సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి జగన్నాథ స్వామివారిని ఆదివారం దర్శించుకున్నారు. పూరీలో తన రెండు రోజుల పర్యటన ముగింపు సందర్భంగా శ్రీమందిరం సందర్శించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ 2 రోజుల విస్తృత కార్యవర్గ సమావేశం సందర్భంగా ఆయన పూరీలో బస చేశారు. రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రితో పాటు న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి రథయాత్ర అంతిమ ఘట్టం నీలాద్రి విజే వరకు సజావుగా విజయవంతం చేసిన వారందరికీ ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రత్న భాండాగారం తెరిచే ప్రక్రియ అంచెలంచెలుగా ఫలప్రదం అవుతుందన్నారు. అనుబంధ యంత్రాంగం ఈ స్ఫూర్తితో ముందుకు సాగి పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని అభ్యర్థించారు.

బడ్జెటు సమావేశాలకు పటిష్ట భద్రత



భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీజీపీ అరుణ్ కుమార్ షడంగి

- 3 అంచెల భద్రత వలయంలో శాసనసభ

భువనేశ్వర్: శాసనసభలో బడ్జెటు సమావేశాలు పురస్కరించుకుని గట్టి భద్రత ఏర్పాటు చేశారు. సమగ్ర శాసనసభకు 3 అంచెల వలయంలో భద్రత కల్పిస్తున్నారు. ఈ కార్యకలాపాల కోసం 30 ప్లాటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు అరుణ్ కుమార్ షడంగి ఆదివారం శాసనసభ ప్రాంగణం సందర్శించి భద్రతా ఏర్పాట్లు ప్రత్యక్షంగా సమీక్షించారు. పోలీసులతో బాంబ్ స్క్వాడ్‌లు, డాగ్ స్క్వాడ్‌లు, స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, ఎస్‌వోజీ జవాన్లను కూడా మోహరించారు. శాసనసభ ప్రాంగణమంతా సీసీ కెమెరాల నిఘాలో ఉంచారు. భువనేశ్వర్ డీసీపీ, కటక్ భువనేశ్వర్ జంట నగరాల పోలీసు కమిషనర్, విజిలెన్స్ డైరెక్టర్ మరియు ఇతర సీనియర్ పోలీసు అధికారులతో భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. శాసన సభకు అనుసంధాన పరిచే అన్ని రహదారులను భద్రతా నిఘా పరిధిలోకి తీసుకున్నారు. మాస్టర్ క్యాంటీన్, లోయర్ పీఎంజీలోని నిరసన ప్రాంతాలపై సీసీటీవీ నిఘా ఏర్పాటు చేశారు. నిరసనకారులు అసెంబ్లీ ఆవరణలోకి చొరబడకుండా మూడు అంచెల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా అసెంబ్లీ చుట్టూ బారికేడ్లతో తాత్కాలిక కంచె ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ప్రవేశ కేంద్రాల వద్ద సాయుధ బలగాలను మోహరించారు.

క్లుప్తంగా

రక్తదాన శిబిరం విజయవంతం



రక్తదానం చేస్తున్న దాతలు

నెల్లిమర్ల: జరజాపుపేటలో సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని ప్రారంభించిన గరివిడి ఎంఈఓ పాలుబోతు రామారావు మాట్లాడుతూ, యువత రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించిన సాధన సభ్యులను అభినందించారు. గ్రామానికి చెందిన 15 మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. సాధన ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, సభ్యులు అవనాపు అప్పలరాజు, మద్దిల రాంబాబు, పి.ఆనంద్, డి.పూర్ణ, ఎన్.మనీష్, ఎం.శేఖర్, హరిమోహన్, సందీప్, డాక్టర్ శిరీష, కౌన్సిలర్ అప్పలనాయుడు, టెక్నీషియన్లు మురళీ, మహేష్ పాల్గొన్నారు.

మలేరియాతో గిరిజన విద్యార్థి మృతి



మలేరియాతో మృతిచెందిన గౌతమ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని వామాసీ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి మండంగి గౌతమ్ (9) మలేరియాతో బాధపడుతూ ఆదివారం ఉదయం వంగర గ్రామంలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. వామాసీ గ్రామానికి చెందిన గౌతమ్ చదువు నిమిత్తం వంగర గ్రామంలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబసభ్యులు తాడికొండ పీహెచ్‌సీకి శనివారం తీసుకెళ్లి వైద్య సేవలు అందించారు. గౌతమ్‌కు మలేరియా నిర్ధారణ కావడంతో వైద్యులు మందులిచ్చారు. మందులు తీసుకుని ఇంటికి వెళ్లిపోయిన గౌతమ్ ఇంట్లోనే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మి, తండ్రి నాగేశ్వరరావు జీవనోపాధి నిమిత్తం వలస వెళ్లారు.

కొప్పెర్ల గురుకులం నిర్వహణపై అసంతృప్తి



విద్యార్థులతో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ అప్పారావు

పూసపాటిరేగ : మండలంలోని కొప్పెర్లలో గల బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మెన్ కేసలి అప్పారావు ఆదివారం సందర్శించారు. పలు సమస్యలు తిష్ట వేయడంతో నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే తరగతి గదులు, వంట గదులను పరిశీలించారు.

గంజాయితో నలుగురు నిందితుల పట్టివేత

- బైక్, స్కూటీ, నాలుగు సెల్‌ఫోన్ల సీజ్



నిందితులను విలేకరుల ముందు హాజరు పరిచిన సీఐ చంద్రశేఖర్, ఎస్సై సుదర్శన్‌లు

కొత్తవలస: బైక్‌పై అక్రమంగా గంజాయిని తరలిస్తూ నలుగురు నిందితులు పట్టుబడినట్లు సీఐ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్సై సుదర్శన్ సిబ్బందితో కలిసి కొత్తవలస జంక్షన్‌లో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఎస్.కోట నుంచి విశాఖ వైపు బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను తప్పించుకునే ప్రయత్నం చేశారు.దీంతో అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డగించి పట్టుకుని విచారణ చేసి వారి వద్ద ఉన్న బ్యాగ్‌లో 3.42 కేజీల గంజాయిని గుర్తించారు. ఈ సందర్భంగా నిందితులను ప్రశ్నించగా అరకు నుంచి తీసుకొస్తున్నామని విశాఖపట్నంలో మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నారని వారికి అప్పజెప్పాల్సి ఉందని చెప్పారు. అయితే ఆ ఇద్దరు వ్యక్తులు కొత్తవలస మండలంలోని చింతలపాలెం గ్రామం సమీపంలో గల ఎస్‌బీఐ వద్ద స్కూటీతో ఉన్నట్లు గుర్తించి వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఒక బైక్, ఒక స్కూటీ, నాలుగు సెల్‌ఫోన్లను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావారం

- జాతీయ విద్యావిధానానికి నాలుగేళ్లు
- ఈ నెల 22 నుంచి 28 వరకు ప్రత్యేక వారోత్సవాలు
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర సమగ్ర శిక్ష శాఖ
- ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో విద్యాశాఖ కార్యాచరణ
- తల్లిదండ్రులు,స్థానికుల భాగస్వామ్యంతో కార్యక్రమం



విద్యా వారం విధివిధానాలపై ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న సమగ్రశిక్ష అధికారి

రామభద్రపురం/పాలకొండ రూరల్/రాజాం: కేంద్రప్రభుత్వం జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ 2020) ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తవుతోంది ఈ సందర్భంగా వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ (విద్యావారం) కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపై, దేశ వ్యాప్తంగా విద్యాభివృద్ధిలో నిబద్ధతను తెలియజేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. అప్పటివరకు ఉన్న 10+2+3 విద్యా విధానం బదులు డాక్టర్ కృష్ణస్వామి కస్తూరి రంగన్ సిఫార్సుల మేరకు నూతన జాతీయ విద్యా విధానం రూపకల్పన చేశారు. ఈ ఎన్‌ఈపీ-2020 5+3+3+4 పాఠశాల విధానాన్ని ప్రవేశపెట్టారు.ఈ విధానాన్ని 2020 జూలై 29న కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది.దీంతో నూతన విద్యా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో కేంద్రం ఆదేశాల మేరకు శిక్షా సప్తాహ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, స్థానికులు భాగస్వామ్యం కావాలని జిల్లా విద్యాశాఖ జారీ చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

వారం రోజుల కార్యక్రమాలు ఇలా..

శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలతో వారం రోజుల పాటు నిర్వహించే ప్రణాళికను విద్యాశాఖ జిల్లాలోని పాఠశాలలకు పంపించింది.

జూలై 22-స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన

ఉపాధ్యాయులు స్థానికంగా లభించే వనరులతో తయారు చేసిన బోధన, అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించాల్సి ఉంటుంది.దీనికి విద్యార్థుల తల్లిందడ్రులతో పాటు స్థానిక పెద్దలను ఆహ్వానించాలి

జూలై 23-పునాది అభ్యసన కార్యక్రమం

దీనిలో భాగంగా 1వ తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి సమాజ భాగస్వాములకు చర్చ ద్వారా అవగాహన కల్పించాల్సి ఉంది.



బూశాయవలస కేజీబీవీ పాఠశాలలో బోధిస్తున్న టీచర్

జూలై 24-క్రీడా దినోత్సవం

వివిధ క్రీడాంశాలపై పోటీలు నిర్వహించడం, శారీరక సౌష్టవం ప్రాముఖ్యతను తెలియజేసేలా ఈ పోటీలు ఉండాలి.

జూలై25-సాంస్కృతిక దినోత్సవం

విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు (ఫ్యాన్సీ)డ్రెస్, పాటలు, నృత్య ప్రదర్శన, నాటికలు నిర్వహించాలి.

జూలై 26-సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం

స్కిల్,డిజిటల్ ఇనిషియేటివ్ డే లో భాగంగా ప్రస్తుత ఉద్యోగావకాశాల నేపథ్యంలో అన్ని తరగతి గది అనుభవాలను మెరుగుపరచడానికి డిజిటల్ కార్యక్రమాలకు అవసరమయ్యే నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించడం. విద్యలో సాంకేతిక అభివృద్ధిని గుర్తించేలా చర్చించడం.

జూలై 27- పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కృత్యాలు (మిషన్ లైఫ్ ఏక్టివిటీస్) పాఠశాలలో పోషణ దినోత్సవం నిర్వహణ (న్యూట్రిషన్ డే) పాఠశాలలో కొత్త ఎకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి అమ్మ పేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటి అమ్మకి అంకితం కార్యక్రమం. దీనిలో భాగంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కనీసం 35 మొక్కలు తల్లీబిడ్డలతో కలిపి నాటించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

జూలై 28-సామాజిక భాగస్వామ్య దినోత్సవం

విద్యార్థుల భావోద్వేగ శ్రేయస్సు కోసం ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాల సహకారాన్ని పెంపొందించడం. నైపుణ్యాభివృద్ధికి పర్యావరణ వ్యవస్థను అందించడం.అంటే పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాల్లో తిథి భోజనాలు, విద్యార్థులతో పెద్దలు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనం చేయడం.

సమగ్రశిక్ష మార్గదర్శకాల మేరకు



రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ప్రతి పాఠశాలలో విద్యావారం తప్పనిసరిగా నిర్వహించేలా చర్యలు చేపట్టాం. సంబంధిత ఫొటోలతో కూడిన డాక్యుమెంటేషన్ నమోదు చేయాలని సూచించాం. ఈ కార్యక్రమం నిర్వహణ, అమలు తీరు, విధి విధానాలను ఉప విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్స్, మండల విద్యాశాఖ అధికారులు పర్యవేక్షిస్తారు.

జి.పగడాలమ్మ, డీఈఓ, పార్వతీపురం మన్యం జిల్లా

అట్టహాసంగా ఆర్‌ఆర్‌ఆర్ జ్యూవెలర్స్ షోరూం ప్రారంభం



ఆర్‌ఆర్‌ఆర్ జ్యూవెలర్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఆర్‌ఆర్ జ్యూవెలర్స్ షోరూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. నగరంలోని డాబాతోట ప్రాంతంలో బంగారు, వెండి ఆభరణ ప్రియులను మెమరపించే డిజైన్‌లతో ఏర్పాటు చేసిన షోరూమ్‌ను ఏపీ శాసన సభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రారంభించారు. అనంతరం నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, మాజీ కార్పొరేటర్ కోలగట్ల వెంకటరమణి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా షోరూమ్ యజమానులు కేదారిశెట్టి సీతారామమూర్తి, రవ్వా శ్రీనివాసరావులు మాట్లాడుతూ వినియోగదారులను ఆకర్షించేలా నూతన డిజైన్‌లతో బంగారం, వెండి ఆభరణాలు తమ షోరూమ్‌లో అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు చెప్పారు. నాణ్యమైన బంగారం, వెండి, డైమండ్స్ సంబంధించిన ఆభరణాలు తక్కువ ధరలకే లభిస్తాయన్నారు. మహిళలను ఆకర్షించేలా ప్రత్యేకమైన ఆభరణాలు సరసమైన రేట్లకు వినియోదారులకు నచ్చేలా ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో మంచుకొండ అప్పలరాజు, బత్తుల బుజ్జినరసింహులు, సీపీఎస్‌సీ.నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

- వెటరన్స్ విభాగంలో పోటీపడిన 100 మంది క్రీడాకారులు



అండర్-19 విభాగంలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. నాలుగు రోజులుగా విజయనగరం జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో భాగంగా చివరి రోజు వెటరన్స్ విభాగంలో స్త్రీ, పురుషులకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. 35 సంవత్సరాల వయస్సు నుంచి 70 సంవత్సరాల లోపు వయస్సు గల వారికి ఈ పోటీలు నిర్వహించగా..జిల్లా నలుమూలల నుంచి 100 మంది క్రీడాకారులు తలపడ్డారు. ఉదయం ప్రారంభమైన పోటీలు రాత్రి వరకు కొనసాగగా..విజయమే లక్ష్యంగా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం కల్పించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

అండర్-19, ఉమెన్/మెన్ విభాగాల్లో విజేతలకు బహుమతులు

జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో భాగంగా అండర్-19, మెన్/ఉమెన్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్, కార్యదర్శి నున్న సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సీహెచ్ కుటుంబరావు, ఉపాధ్యక్షుడు కుసుంబచ్చన్, అసోసియేషన్ ప్రతినిధులు ఎంకేబీ శ్రీను, టి.రమేష్, సహాయ కార్యదర్శులు మల్లికార్జునరావు, టీఎల్ సుబ్బారావు, మీసాల సూరిబాబులు బహుమతులు ప్రదానం చేశారు.

అండర్ -19 బాలుర సింగిల్స్ విభాగంలో..

ఎం.రోహిత్, ఎస్.జుగునేశ్వర్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోగా..డబుల్స్ విభాగంలో కె.పవన్-ఎస్.దినేష్‌ల జట్టు, కె.లోకేష్-డి.ప్రవీణ్‌కుమార్‌ల జట్లు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి.

అండర్-19 బాలికల సింగిల్స్ విభాగంలో..

వి.జాహ్నవి, బి.హారికలు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకోగా..డబుల్స్ విభాగంలో బి.హారిక-పి.మోనికల జట్టు, బి.కీర్తి-వి.సాయిభువన తేజల జట్లు విజేతలుగా నిలిచాయి.

పురుషుల సింగిల్స్ విభాగంలో..

ఎం.రోహిత్‌కుమార్, బి.సూర్యకిరణ్‌లు..డబుల్స్ విభాగంలో ఎస్.కె.అమన్-కె.శ్రీనుల జట్టు, బి.సూర్యకిరణ్-జి.సత్యనారాయణల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు దక్కించుకున్నాయి. ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో వి.జాహ్నవి, జె.శ్రేయదేవిలు..డబుల్స్ విభాగంలో వి.జాహ్నవి-బి.హారికల జట్టు, పి.మోనిక-ఎ.కాత్యాయనిల జట్లు మొదటి రెండు స్థానాలు కైవసం చేసుకున్నాయి.

డివైడర్‌ను ఢీ కొట్టిన ఎరువుల లారీ

- రెండు గంటలు ట్రాఫిక్ జామ్



ప్రమాదానికి గురై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన ఎరువుల లారీ



భారీగా నిలిచిపోయిన వాహనాలు

వీరఘట్టం: వీరఘట్టం-పాలకొండ సీఎస్‌పీ రహదారిలో చిదిమి జంక్షన్ వద్ద డివైడర్‌ను ఓ ఎరువుల లారీ ఆదివారం సాయంత్రం ఢీ కొట్టింది. ప్రమాదకర మలుపు ఉన్నట్లు డ్రైవర్ గుర్తించకపోవడంతో వేగంగా వచ్చిన లారీ డివైడర్‌ను ఢీ కొట్టిందని స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు కానీ ఇరుకుగా ఉన్న డివైడర్ సిమెంట్ గోడ కూలిపోయింది. రోడ్డుకు అడ్డంగా లారీ ఉండి పోవడంతో రోడ్డుకు ఇరువైపులా సుమారు రెండు గంటల సేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎస్సై షేక్ ఫకృద్దీన్, ఏఎస్సై కృష్ణంనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రెండు జేసీబీలను తీసుకువచ్చి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లారీని తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

విద్యుత్‌షాక్‌తో పాడి గేదె మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన పాడి గేదె

కురుపాం: మండలంలోని శివ్వన్నపేట గ్రామ పంటపొలాల్లో విద్యుత్ వైర్లు స్తంభానికి కట్టి ఉండడంతో స్తంభాన్ని పాడిగేదె తాకడంతో షాక్ కొట్టి ఆదివారం మృతి చెందింది. ఈ సందర్భంగా పాడి రైతు గౌడు హరి ఆవేదన వ్యక్తం చేస్తూ ఆ పాడి గేదె పైనే తమ జీవనాధారమని దాని విలువ సుమారు రూ.80 వేలు విలువ ఉంటుందని కన్నీటి పర్యంతమయ్యాడు. అధికారులు ఆదుకోవాలని కోరుతున్నాడు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం

- ధ్వంసమైన మోటార్ సైకిల్
- భయాందోళనలో గ్రామస్తులు



కాలంరాజుపేటలో విరిగిపడిపోయిన విద్యుత్ స్తంభం



విద్యుత్ స్తంభం పడి ధ్వంసమైన మోటార్ సైకిల్

తెర్లాం: వీధిలో ఉన్న విద్యుత్ స్తంభం ఒక్కసారి విరిగి పడిపోవడంతో త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తెర్లాం మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో ఓ వీధిలో గల విద్యుత్ స్తంభం ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఆదివారం అకస్మాత్తుగా విరిగి పడిపోయింది. స్తంభానికి ఉన్న వైర్లు ఇళ్లపై పడ్డాయి. విద్యుత్ స్తంభం నేలకొరిగిన సమయంలో విద్యుత్ సరఫరా ఉండడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నిత్యం ప్రజలు సంచరించే వీధిలో విద్యుత్ స్తంభం విరిగిపోయి ఓ ఇంటిపై పడడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు హడలిపోయారు. విద్యుత్ స్తంభం విరిగిపోయి రోడ్డు మీద ఉన్న మోటార్ సైకిల్‌పై పడడంతో అది ధ్వంసమైంది. దీనిపై గ్రామస్తులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించగా వెంటనే వారు సరఫరా నిలిపివేసి ఎటువంటి ప్రమాదం జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. విరిగిపడిపోయిన స్తంభాన్ని వెంటనే సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

చీటింగ్ కేసులో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై హరిబాబునాయుడు (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: స్థానిక మయూరి జంక్షన్ వద్ద నున్న రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కమ్ ఇన్‌చార్జ్ మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్‌ను చీటింగ్ కేసులో వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్సై హరిబాబు నాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

ప్రవీణ్‌కుమార్ కొంతకాలంగా ఖాతాదారుల నుంచి డబ్బులు కలెక్ట్ చేస్తూ బ్యాంక్‌కు కట్టకుండా రూ.34 లక్షలు సొంతానికి వాడుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సంస్థ ఉన్నతాధికారులు నోటీసులు పంపించినప్పటికీ స్పందించకపోవడంతో వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. సుమారు 20 మంది నుంచి ప్రవీణ్‌కుమార్ డబ్బులు వసూలుచేసినట్లు తెలుస్తోందని పోలీసులు స్పష్టం చేశారు. బ్యాంక్ రీజనల్ మేనేజర్ సెల్వన్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై హరిబాబునాయుడు కేసు నమోదుచేసి, నిందితుడ్ని అరెస్టు చేసి ,రిమాండ్‌కు తరలించారు.

వీడని పేగుబంధం

నవమాసాలు కడుపులో మోసి ప్రపంచంలోకి తీసుకువచ్చేది తల్లి అయితే..ఈ ప్రపంచాన్ని పరిచయం చేసేది తండ్రి. గురువు, దైవం, మార్గదర్శకుడై, పిల్లల చేయిపట్టి నడిపిస్తూ..భవిష్యత్తు కోసం నిత్యం తపించే తండ్రికి పిల్లలంటే ఎనలేని ప్రేమ. పిల్లల కాలిలో ముల్లు గుచ్చుకుంటే తన గుండెల్లో గునపం దిగినంత బాధ ననుభవించే తండ్రి..విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయిన కూతురి వెంటే తాను కూడా అనంత లోకాలకు పయనమయ్యాడు. డెంకాడ మండలంలోని డి.తాళ్లవలస గ్రామంలో జరిగిన ఈ విషాద సంఘటన వివరాలిలా ఉన్నాయి.

-డెంకాడ

- విద్యుత్ షాక్‌తో తండ్రీకూతుళ్ల మృతి



సూర్యారావు(ఫైల్)



సంధ్యారాణి(ఫైల్)

డి.తాళ్లవలస గ్రామానికి చెందిన కట్టా సూర్యారావు (45)కు భార్య శకుంతలతో పాటు కుమార్తె సంధ్యారాణి, కుమారుడు మనోజ్ ఉన్నారు. సూర్యారావు వ్యాపారం చేసి ఆర్థికంగా స్థిరపడ్డాడు. కుమార్తె సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. వర్క్ ఫ్రం హోమ్‌లో భాగంగా ఇంటి నుంచే విధులు నిర్వహిస్తోంది. ఇంటి మేడపై ఆరవేసిన చీరను తీసేందుకు శుక్రవారం రాత్రి కుమార్తె సంధ్యారాణి(22) మేడపైకి వెళ్లింది. ఇంటి ముందు భాగంలో ఉన్న విద్యుత్‌వైరుపై చీర పడింది. చినుకులు పడుతుండడం వల్ల చీర తడిసిపోవడంతో చీర తీస్తున్న సంధ్య విద్యుత్ షాక్‌కు గురై పడిపోయింది. ఆ సమయంలో బిగ్గరగా అరవడంతో తండ్రి కట్టా సూర్యారావు(45) మేడపైకి వెళ్లి కింద పడి ఉన్న కుమార్తెను లేపేందుకు ప్రయత్నిస్తుండగా ఆయన కూడా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో తండ్రీకూతుళ్లు ఏకకాలంలో మరణించారు. మేడమీదకు వెళ్లిన తండ్రి, సోదరి కిందికి రాకపోవడంతో కుమారుడు మనోజ్ వెళ్లి చూసి వారిద్దరూ విద్యుత్ షాక్‌కు గురయ్యారని గమనించి కాపాడే ప్రయత్నంలో వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. అనంతరం ఇద్దరినీ గ్రామస్తుల సహాయంతో విజయనగరంలోని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై కృష్ణమూర్తి చెప్పారు.

'తోటపల్లి'లో తగ్గిన నీటి ప్రవాహం



తోటపల్లి ప్రాజెక్టు వద్ద నీటి ప్రవాహం

గరుగుబిల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు వద్ద కాస్త పెరిగిన నీటి ప్రవాహం క్రమేపీ తగ్గుముఖం పట్టింది. నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం సాయంత్రం నాటికి 105 మీటర్ల లెవిల్‌కుగాను 103.95 మీటర్ల లెవిల్‌లో నీరు నిల్వ వుంది. ప్రస్తుతం నది పైభాగం నుంచి ప్రాజెక్టుకు 1333 క్యూసెక్కుల నీరు రాగా ఈ మేరకు అధికారులు రెండు గేట్లును ఎత్తివేసి 1,175 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. అలాగే కాలువల ద్వారా 210 క్యూసెక్కుల నీటిని విడిచి పెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.53 టీఎంసీలకుగాను 2.136 టీఎంసీల నీటి సామర్థ్యం వున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు వద్ద నీటి పరిస్థితిని ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

చినకుదమలో ఏనుగులు



పంట పొలాలలో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని చినకుదమ పంట పొలాలలో ఆదివారం ఏనుగులు దర్శనమిచ్చాయి. అరటి, పామాయిల్ తోటలలో ఉంటూ పెదకుదమ, సింగనాపురం పంట పొలాలలోకి జారుకున్నాయి. ప్రస్తుతం ఉభాలు జరుగుతుండడంతో వరినారు ధ్వంసం చేయకుండా తగు చర్యలు తీసుకోవాలని అటవీ శాఖాధికారులను రైతులు కోరుతున్నారు.